క్లుప్తంగా

ఘనంగా ఈసీసీఈ డే వేడుకలు



వేడుకలో పాల్గొన్న చిన్నారులు

మద్రిపాలెం : జీవీఎంసీ 51 వార్డు గాంధీనగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈడే (ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ దినోత్సవం) వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు ఏ విధంగా ఆటపాటలతో కూడిన విద్య అందిస్తున్నారో తల్లిదండ్రుల సమక్షంలో ప్రత్యక్షంగా వివరించారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందించడంతోపాటు ఆటపాటల ద్వారా పిల్లల మేధోశక్తిని పెంచే విధంగా విద్య బోధిస్తున్నామని టీచర్ మాలా బీబీ అన్నారు. చిన్నారుల శారీరక, మానసిక అభివృద్ధి కోసం అంగన్‌వాడీ కార్యకర్తలకు చిన్నారుల తల్లిదండ్రులు కూడా సహకరించాలని కోరారు.

వైభవంగా పాశుర పారాయణం

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 4 గంటలకు ప్రాతఃకాలార్చన అనంతరం గోదాదేవి విగ్రహంతో మేళతాళాల మధ్య వేద మంత్రోచ్ఛరణలతో ఆలయ అర్చకుడు శేషాచార్యుడు, ఈవో బండారు ప్రసాద్, భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. తిరుప్పావై సేవా కాలంలో భాగంగా గోదాదేవి తరఫున శ్రీరంగనాథుడికి భక్తులు సామూహికంగా 22వ పాశురం విన్నవించారు. అనంతరం మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు. వైభవుడికి నక్షత్ర హారతి సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న శ్యామలాదీపిక

కంచరపాలెం : జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి పెదకొత్తూరు కొండవాలు ప్రాంతంలో వార్డు కార్పొరేటర్ కంటి పాము కామేశ్వరి ఆధ్వర్యంలో ప్రహరీ నిర్మాణానికి బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక సోమవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.19.85 లక్షలతో 25 మీటర్ల రక్షణ గోడ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు జీవీఎంసీ జోన్ – 5 ఏఈ అర్చన తెలిపారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రభు, గ్రామాధ్యక్షుడు మునపర్తి వెంకటరమణ, చెంగల కిషోర్, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంగవల్లుల పోటీలు రేపు

మురళీనగర్ : మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ఈ నెల 8న మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి, కార్యదర్శి జయ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం నుంచి వైశాఖి స్పోర్ట్సు పార్కులో పోటీలు నిర్వహిస్తామన్నారు. వనితా వాకర్స్ క్లబ్ సభ్యుల తోపాటు నగరంలోని ఇతర ప్రాంతాల మహిళలు కూడా పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఎం.ప్రమీల 9396255654, ఆర్.స్నేహలత 7207287600ను సంప్రదించాలని సూచించారు. పోటీలో పాల్గొనే సభ్యులు వారికి అవసరమైన రంగులు, ముగ్గు పిండి, ఇతర సామగ్రి తెచ్చుకోవాలన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తామని తెలిపారు.

ప్రమాదకర షెల్టర్లు



మర్రిపాలెంలో ప్రమాదభరితంగా బస్‌షెల్టర్

కంచరపాలెం : ఎండ, వాన, మంచుల నుంచి నీడనిచ్చే బస్ షెల్టర్లు ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికులు, పాదచారులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కంచరపాలెం నేతాజీ కూడలి నుంచి ఎన్‌ఏడీకి వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారిలో నిర్మించిన బస్ షెల్టర్లు ప్రమాదభరితంగా మారాయి. కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, మర్రిపాలెం ప్రాంతాల్లో నిర్మించిన షెల్టర్లు ఇటీవల ప్రమాదాలకు నిలయంగా మారాయి. బీఆర్‌టీఎస్ సబ్‌వే మార్గాల్లో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగించడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించే వాహనాలు వేగంగా బస్ షెల్టర్లను ఢీకొట్టడంతో వాటి స్తంభాలు నేలకు ఒరిగేందుకు సిద్ధంగా ఉన్నాయి. వాహనాల వేగానికి కళ్లెం వేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు. గత నాలుగు నెలలుగా ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు. బీఆర్‌టీఎస్ బస్ షెల్టర్లు అధ్వానంగా తయారవడంతో బిచ్చగాళ్లు, మతిభ్రమించిన అనాథలకు ఆశ్రమంగా మారాయి. దీంతో ఆ బస్ షెల్టర్‌లోకి ప్రయాణికులు వెళ్లేందుకు భయాందోళన చెందుతున్నారు. జోన్ – 5 ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడే లేడని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల తుఫాన్ ఈదురు గాలులకు బస్‌షెల్టర్లపై రేకులు ఎగిరిపోయాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. నేలకొరిగేందుకు సిద్ధంగా ఉన్న స్టీల్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని ఫిర్యాదులు చేసినా నిర్లక్ష్యంగా వదిలేశారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని నగరవాసులు కోరుతున్నారు.

వాహనాలు ఢీకొనడంతో ఒరిగిన స్తంభాలు

కూలే స్థితిలో ఉన్నా స్పందించని అధికారులు

బిక్కుబిక్కుమంటూ నిరీక్షిస్తున్న ప్రయాణికులు

భయపడుతూ కూర్చుంటున్నాం

ప్రమాదభరిత బస్ షెల్టర్లతో ఆందోళనగా ఉంది. ప్రమాదం జరిగి నెలలు గడుస్తున్నా బస్‌షెల్టర్‌కు మరమ్మతులు చేపట్టలేదు. షెల్టర్‌లో బస్సుల కోసం నిరీక్షించే ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ కూర్చుంటున్నారు. అవి ఎప్పుడు పడిపోతాయోనని భయంగా ఉంటుంది. నేలకొరిగిన స్తంభాలను తొలగించాలి.

– సంజన, ప్రయాణికురాలు, కంచరపాలెం

అధికారులు స్పందించాలి

ప్రమాదభరిత బస్‌షెల్టర్లపై ప్రయాణికులు, పాదచారులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తుఫాన్ గాలులకు రేకులు ఎగురుతున్నాయి. అవి జనంపై పడతాయేమోనని స్థానికులు హడలిపోతున్నారు. ఇప్పటికే స్తంభాలు నేలకొరుగుతున్నాయి. అధికారులు స్పందించి వాటికి మరమ్మతులు చేపట్టాలి.

– యర్రా చరణ్, ప్రయాణికుడు, మర్రిపాలెం.



ఊర్వశి కూడలిలో ప్రమాదభరితంగా బీఆర్‌టీఎస్ బస్‌షెల్టర్



ఒరిగిపోయిన బస్ షెల్టర్ స్తంభం

గురు గోవింద్‌సింగ్ బోధనలు అనుసరణీయం



గురుద్వారాలో ఎంపీ పురందేశ్వరి, తదితరులు

సీతమ్మధార : గురు గోవింద్‌సింగ్ బోధనలు అనుసరణీయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. స్థానిక గురుద్వారలో గురుగోవింద్ సింగ్ జీ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరికీ సేవ, సమానత్వం, న్యాయం గురించి నొక్కి చెప్పే గురు గ్రంథ్ సాహిబ్ బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని కోరారు. వాహే గురువు ఆశీస్సులు పొందేందుకు తనకు అవకాశం కల్పించినందుకు కమిటీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. అంతకు ముందు ఆమెకి గురుద్వారా కమిటీ ప్రతినిధులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆమెకి కత్తి, జ్ఞాపిక అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. బీజేపీ నాయకురాలు శ్యామలా దీపికను కూడా జ్ఞాపిక, శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిఖ్ మిషన్ రాష్ట్ర ఇన్‌ఛార్జి డాక్టర్ డీఎస్ ఆనంద్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతుబజారులో 170 స్టాళ్లకు డ్రా



డ్రా తీసి రైతుకు టోకెన్ ఇస్తున్న ఈవో కృష్ణమూర్తి

సీతమ్మధార : సీతమ్మధార రైతుబజారులో సోమవారం మొత్తం 170 రైతుల స్టాళ్లకు డ్రా తీశారు. ఉదయం రైతులు వంద మంది, సాయంత్రం రైతులు 70 మందికి దుకాణాలు, స్టాళ్ల కేటాయించేందుకు రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కృష్ణమూర్తి డ్రా తీసి టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతీ వారం స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. రైతులు విధిగా వారికి కేటాయించిన స్టాళ్లలోనే విక్రయాలు చేయాలని సూచించారు. స్టాళ్లున్నప్పటికీ కూరగాయలు నేల మీద విక్రయించరాదని కోరారు. కార్యక్రమంలో అటెండర్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు బాలకృష్ణమ్మ



మార్పు బాలకృష్ణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

మురళీనగర్ : మార్పు బాలకృష్ణమ్మ ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడిగా గుర్తింపు పొందారని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938) జిల్లా గౌరవాధ్యక్షుడు ఏఎస్ నాయుడు అన్నారు. మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో మార్పు బాలకృష్ణమ్మ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.హేమలత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మార్పు బాలకృష్ణమ్మ ఉపాధ్యాయ లోకానికి ప్రాతఃస్మరణీయుడని చెప్పారు. 1974 నుంచి 1985 వరకు 11 సంవత్సరాలు ఎమ్మెల్సీగా పనిచేసి శాసన మండలిని ''ఉపాధ్యాయ ఉద్యమ వేదిక'' గా మార్చి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. ఉపాధ్యాయులకు చరిత్రాత్మకమైన రీగ్రూప్ ఇన్ స్కేల్, అప్రయత్న పదోన్నతి సాధించారని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ, గ్రాట్యుటీ, పింఛను, మెరుగైన వేతన సవరణ సాధించడంలో ఆయన కీలక భూమిక వహించారని పేర్కొన్నారు. ముందుగా బాలకృష్ణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విశాఖ పట్నం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధనుంజయ రావు, సేవియర్, ఏఎస్ఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరభద్రరావు, వెంకటరావు, అర్బన్ జిల్లా బాధ్యులు బి.ప్రసాద్, సీనియర్ నాయకుడు జోజి బాబు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఆపే వరకూ పోరాడతాం



పోర్టు హాస్పిటల్ వద్ద దీక్షలో సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపే వరకు పోరాడుతామని సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు సీహెచ్ పద్మనాభరాజు అన్నారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆస్పత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 98వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణ టెండర్‌కు ఎవరొచ్చినా అడ్డుకుని తీరాలని, తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. పోర్టు యాజమాన్యమే ఆస్పత్రిని నిర్వహించాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే కార్మికులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. బి.జగన్, కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, శంకరరావు, కేఎస్ కుమార్, రాఘవులు, విజయ్‌కుమార్ నాయుడు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పర్యటన విజయవంతం చేయాలి

సీతమ్మధార : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశాఖపట్నం పర్యటన విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు కోరారు. నార్త్ ఎక్స్‌టెన్సన్‌లో గల బీజేపీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కోరిక రైల్వేజోన్ ఇన్నాళ్లకు నెరవేరుతుందన్నారు. విశాఖ పర్యటన నిమిత్తం ఈ నెల 8న విశాఖ వస్తున్న ప్రధానమంత్రి మోదీకి ఘనస్వాగతం పలకాలని కోరారు. సమావేశంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, పాల మరశెట్టి శ్రీనివాస్, జోన్ – 5 జోనల్ కమిషనర్ రాము, యూసీడీ విభాగం ఏపీడీ పుణ్యవతి, కూటమి నాయకులు, ఆయా పార్టీల వార్డు అధ్యక్షులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

ప్రధాని పర్యటనతో రాష్ట్ర అభివృద్ధి

సీతంపేట : ఈ నెల 8న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశాఖ పర్యటనకు వస్తున్నారని, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలకాలని జనసేన పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. సీతంపేటలోని జనసేన పార్టీ నగర కార్యాలయంలో ప్రధాని పర్యటనపై పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ విశాఖ పర్యటన రాష్ట్ర అభివృద్ధికి దిక్సూచి కాబోతుందన్నారు. జనసేన పార్టీ తరఫున ఘన స్వాగతం పలకడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని తెలిపారు. ప్రధానితోపాటు సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రోడ్ షోలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఏయూ గ్రౌండ్స్‌లో బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు. ఎన్‌టీపీసీలో రూ.85 వేల కోట్ల పెట్టుబడితో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టును ప్రధాని ప్రారంభిస్తారని, దీనివల్ల 25 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కార్పొరేటర్లు, పార్టీ వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

ఏది కమర్షియల్..? ఏది డొమెస్టిక్...?

గ్యాస్ సబ్సిడీ దుర్వినియోగం

సీతమ్మధార : కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న గ్యాస్ సబ్సిడీ దుర్వినియోగమవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇళ్లలో వినియోగించాల్సిన డొమెస్టిక్ సిలిండర్లను పలువురు పార్లర్లు, రెస్టారెంట్లు, హోటళ్ల వ్యాపారులు ఇష్టారాజ్యంగా దుర్వినియోగం చేస్తున్నా ఇటు పౌర సరఫరాలశాఖ అధికారులు, అటు చమురు కంపెనీల సేల్స్ ఆఫీసర్లు పట్టించుకోవడం లేదని పలువురు మండిపడుతున్నారు. గత ఏడాది అక్టోబర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల పథకం ప్రారంభించిన విషయం తెలిసిందే. అంటే ఒక్కో సిలిండర్‌కి ప్రభుత్వం రూ.811 వంతున సొమ్ము వెచ్చిస్తుంది. దీంతో ఉచితంగా వస్తున్న సిలిండర్లను పలువురు వ్యాపారులు దర్జాగా హోటళ్లు, పార్లర్లు, రెస్టారెంట్లలో వినియోగిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి వాణిజ్య అవసరాలకు కమర్షియల్ సిలిండర్ వినియోగించాలని చమురు కంపెనీల నిబంధనలు చెబుతున్నాయి. పైగా డొమెస్టిక్ సిలిండర్‌తో పోలిస్తే ఈ సిలిండర్ ఖరీదు ఎక్కువ అన్న నెపంతో హోటల్ వ్యాపారులు డొమెస్టిక్ సిలిండర్లను పక్కదారిలో వినియోగిస్తున్నారు. ప్రస్తుతం 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధర రూ.1800 పైమాటే.



వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తున్న దృశ్యం

క్యాటరింగ్ సంస్థల దుర్వినియోగం

నగరంలోని పలు ప్రాంతాల్లో గల క్యాటరింగ్ సంస్థలు దర్జాగా డొమెస్టిక్ సిలిండర్ వాడుతున్నా అధికారులు దాడులు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. చమురు కంపెనీల సేల్స్ ఆఫీసర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాల్సి ఉన్నా అటువైపు వీరెవరూ కన్నెత్తి చూడడం లేదు. పెద్ద వ్యాపారుల మీద అధికారులు దాడులు చేయకపోవడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉత్తర నియోజకవర్గ పరిధిలో సీతమ్మధార ఎంఎంటీసీ కాలనీ, గురుద్వార, అక్కయ్యపాలెం, నరసింహనగర్, రేసపువానిపాలెం తదితర ప్రాంతాల్లో గ్యాస్ ఏజెన్సీలున్నాయి. కొంత మంది హోటల్ వ్యాపారులు నేరుగా గ్యాస్ ఏజెన్సీ యజమానులతో కుమ్మక్కై డొమెస్టిక్ సిలిండర్లను నేరుగా హోటల్ వద్దకే డెలివరీ చేసేలా చూసుకుంటున్నారని ఆరోపణలున్నాయి. టీపీటీ కాలనీ, నక్కవానిపాలెం, సీతమ్మధార, ఎంఎంటీసీ కాలనీ, నార్త్ ఎక్స్‌టెన్సన్, బాలయ్యశాస్త్రి లే అవుట్, రాధాకృష్ణ లే అవుట్, సత్యం జంక్షన్, పీ అండ్ టీ కాలనీ, తదితర ప్రాంతాల్లో గల పార్లర్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ సంస్థలు యథేచ్ఛగా గృహావసరాల సిలిండర్లను వాడుతున్నారని సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అటు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న మూడు సిలిండర్లు పక్కదారి పట్టకుండా పౌరసరఫరాల శాఖ, చమురు కంపెనీల సేల్స్ ఆఫీసర్లు స్పందించి దాడులు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

వైశాఖి స్పోర్ట్స్ పార్కులో అభివృద్ధి పనులు

మురళీనగర్ : వైశాఖి స్పోర్ట్సు పార్కులో అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇక్కడి ప్రాంగణంలో శ్రీకృష్ణుడి విగ్రహం చుట్టూ ఉన్న కొలను పాడవడంతో పునర్నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు కొలను చుట్టూ టైల్స్ అమర్చి అందంగా తీర్చిదిద్దున్నారు. ఇది పూర్తయిన వెంటనే మురళీకృష్ణుడి విగ్రహానికి రంగులు వేసి ఆకర్షణీయంగా తయారు చేస్తారు. కొలనులో రెండు రకాల కలువ మొక్కలు పెంచుతారు. వైశాఖీ భవనం స్లాబు నాచు పట్టి పాడవడంతో దానికి మరమ్మతులు చేయడానికి ప్రణాళిక తయారు చేశారు. స్లాబ్‌పై ఏర్పాటు చేసిన సోలార్ ఎనర్జీ పలకాలను తొలగించి పనులు ప్రారంభిస్తామని పార్కు కమిటీ సభ్యులు తెలిపారు. పార్కులోని కళాక్షేత్రంపై అదనంగా ఒక అంతస్తు నిర్మించి గ్రీన్ రూము, కార్యాలయం గదికి వినియోగించన్నుట్లు ఆయన చెప్పారు.



శ్రీకృష్ణుడి విగ్రహం చుట్టూ నిర్మాణ పనులు చేస్తున్న సిబ్బంది

మేడ పైనుంచి జారిపడి వ్యక్తి మృతి

సీతమ్మధార : మేడ పైనుంచి జారిపడి ఓ వ్యక్తి మరణించాడు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రైల్వే న్యూ కాలనీ కనకారావు వీధి బలరామ్ అపార్ట్‌మెంట్‌లో భార్య, ఇద్దరు పిల్లలతో దల్లి డేవిడ్ (38) నివసిస్తున్నారు. నగరంలోని ఓ వస్త్ర దుకాణంలో సేల్స్‌మేన్‌గా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో పిల్లల కోసం ఆయన సోమవారం రాత్రి గాలిపటం కొనుగోలు చేశారు. అనంతరం మేడ మీద గాలిపటం ఎగుర వేస్తుండగా, కాలుజారి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయలు తగలడంతో అక్కడికక్కడే మరణించాడు. భార్య అనూష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. ఈ కేసుని నాలుగో పట్టణ సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో ఏఎస్ఐ లక్ష్మం నాయుడు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాద స్థలంలో డేవిడ్ మృతదేహం

గృహ హింస బాధితురాలికి ఆశ్రయం

సీతమ్మధార : గృహహింస కారణంగా రోడ్డున పడిన ఒక గృహిణికి జీవీఎంసీ నిరాశ్రయుల వసతి గృహంలో సోమవారం ఆశ్రయం కల్పించారు. ఏయూటీడీ సంస్థ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లాకు చెందిన బొత్స రోహిణి (38) తండ్రి రెండో పెళ్లి చేసుకోవడంతో సవతి తల్లి వేధింపులు భరించలేక ఇళ్లు వదిలి వైజాగ్ వచ్చేసింది. రోడ్డు మీద కూడా ఆకతాయిల వేధింపులు భరించలేక డాబాగార్డెన్స్‌లో గల ప్రేమసమాజానికి వెళ్లింది. వారు నేరుగా ద్వారకానగర్‌లోని టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ – జీవీఎంసీ మహిళా నిరాశ్రయుల వసతి గృహానికి తరలించారు. తనకి షెల్టర్ ఇవ్వడంతోపాటు, చుట్టూ ఉన్న వ్యాపార సముదాయాల్లో ఉపాధి చూసుకుని హాస్టల్ చూసుకోమని సిబ్బంది చెప్పారు. వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో షెల్టర్ సిబ్బంది, కేర్ టేకర్ లీలా ఆమెకి ఆశ్రయం కల్పించారు.

అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514లో సంప్రదించాలి.

నేటి నుంచి లేపాక్షిలో థీమాటిక్ ప్రదర్శన

డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ హస్తకళాభివృద్ధి సంస్థ ఎండీ విశ్వ సూచనల మేరకు మంగళవారం నుంచి 11వ తేదీ వరకు జగదాంబ జంక్షన్ సమీపాన గల లేపాక్షి షోరూంలో థీమాటిక్ ప్రదర్శన నిర్వహించనున్నట్టు లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియం మేనేజర్ కార్తీక్ కుమార్ తెలిపారు. వివిధ రాష్ట్రాల హస్తకళాకారులు రూపొందించిన కళాఖండాలు విక్రయించనున్నారన్నారు. ప్రదర్శన ద్వారా స్థానిక కళలకు ప్రోత్సాహం లభిస్తుందని కార్తీక్ కుమార్ తెలిపారు. ప్రదర్శనలో పెన్ కలంకారీ పెయింటింగ్ (శ్రీకాళహస్తి), బనానా ఫైబర్ ఉత్పత్తులు (కడప), సవర ఆదివాసీ పెయింటింగ్ (మన్యం), ఏటికొప్పాక లక్క బొమ్మలు(అనకాపల్లి), వైట్ ఉడ్ బర్డ్స్ (రాజమహేంద్రవరం) చేతి వృత్తి బొమ్మలు ప్రదర్శన, విక్రయాలు ఉంటాయన్నారు.

గాంధేయ మార్గ పోరాటంతో రైల్వే జోన్

- ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి చలసాని గాంధీ
- ప్రధాని మోదీ చేతుల మీదుగా రేపు శంకుస్థాపన



డాబాగార్డెన్స్ : గాంధేయ మార్గ పోరాటమే రైల్వే జోన్ సాధించి పెట్టిందని, నాలుగు దశాబ్దాల పోరాటానికి ఈ నెల 8న ప్రధాని నరేంద్ర మోదీ ఉత్తరాంధ్ర జిల్లాల వాసుల కళ నెరవేర్చనున్నారని అఖిల భారత రైల్వే ఉద్యోగుల సమాఖ్య మాజీ ఉపాధ్యక్షుడు, ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి చలసాని గాంధీ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మీడియాతో మాట్లాడారు. రైల్వే జోన్ కోసం గౌతు లచ్చన్న, బాట్టం శ్రీరామమూర్తి, ద్రోణంరాజు సత్యనారాయణ, కింజరాపు ఎర్రన్నాయుడు, కమ్యూనిస్టు నాయకులు సీహెచ్ నరసింగరావు, జేవీ సత్యనారాయణమూర్తి..ఇలా ఎందరో ప్రజాప్రతినిధులు, కార్మిక నాయకులు 40 ఏళ్లుగా ఉద్యమాన్ని సజీవంగా ఉంచారన్నారు. ఉత్తరాంధ్రలోని వాల్తేర్ డివిజన్‌పై ఎప్పుడూ వివక్షేనని, కొత్త ప్రాజెక్టుల మంజూరు నుంచి కొత్త రైలు మార్గాలు, కొత్త రైళ్లు, అదనపు బెర్తులు, కొత్త పోస్టులు, ఉద్యోగ నియామకాలు..ఇలా అన్నింటిలోనూ ఆగ్నేయ రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే ఆధ్వర్యంలో బాగా అన్యాయానికి గురయ్యామన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో రైల్వే జోన్ ప్రస్తావన ఉన్నా, వివిధ కారణాలతో ఇప్పటి వరకు ఆంధ్రుల కల నెరవేరలేదన్నారు. జోన్ ప్రారంభోత్సవం అవ్వగానే కార్యకలాపాలు ప్రారంభించడానికి అవసరమైన భవనాలు ఇప్పటికే విశాఖలో సిద్ధంగా ఉన్నాయన్నారు. రైల్వే జోన్ ఏర్పాటైతే కొత్త ప్రాజెక్టులు, ప్రొడక్షన్ యూనిట్లు, వర్క్‌షాప్‌లు మంజూరవుతాయన్నారు. కొత్త రైలు మార్గాలు, కొత్త రైళ్లు, స్టేషన్లు, అదనపు బెర్త్‌లు వస్తాయని, విశాఖ నుంచి న్యూఢిల్లీకి రాజధాని ఎక్స్‌ప్రెస్ వస్తుందన్నారు.